## క్లుప్తంగా

### ధైర్యంగా అభివృద్ధికి బాటలు వేయాలి


మాట్లాడుతున్న తహసీల్దార్

సైదాపురం: సమాజంలో ధైర్యంగా నిలబడి అభివృద్ధికి బాటలు వేయాలని తహసీల్దార్ ఇ.రమాదేవి పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన సైదాపురంలోని స్త్రీ శక్తి కార్యాలయంలో ఏపీఎం చంద్రశేఖర్ అధ్యక్షతన మంగళవారం అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఆడబిడ్డలను కష్టపడి చదివించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్, డీటీ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

### మూగజీవాల వ్యాధులపై అవగాహన అవసరం


దాణా అందిస్తున్న అధికారులు

పెళ్లకూరు: వాతావరణంలో మార్పులు, జోరుగా కురుస్తున్న వర్షాలతో మూగజీవాలను ఆశించే వ్యాధులు, వాటి నివారణపై పాడి రైతులు అవగాహన కలిగి ఉండాలని పశు సంవర్ధకశాఖ ఏడీ ధనుంజయులు సూచించారు. మంగళవారం కొత్తూరులో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయశాఖ అధికారులు మూగజీవాలకు వ్యాపించే సీజనల్ వ్యాధులు, నివారణపై పాడి రైతులకు అవగాన కల్పించారు. పునబాక, చెంబేడు, అర్దమాల తదితర గ్రామాల పాడిరైతులకు ఉచితంగా పశు పోషణ దాణా అందించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి డాక్టర్ ప్రవీణ, చెంబేడు పశు వైద్యులు గుణశేఖర్, వీపీఏలు ప్రదీపిక, అశోక్ పాల్గొన్నారు.

### అనువైన పంటలను సాగు చేయాలి


పంగిలిలో రైతులకు సూచనలిస్తున్న సోమసుందర్

రాపూరు: రైతులు వాతావరణానికి అనువైన పంటలను సాగు చేయాలని రాపూరు వ్యవసాయాధికారి సోమసుందర్ అన్నారు. రాపూరు మండలం పంగిలి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి లభ్యతను బట్టి పంటలు సాగు చేస్తే రైతులు నష్టపోకుండా ఉంటారన్నారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని ఆయన సూచించారు. రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రమాదకరంగా రోడ్డుపై గుంత


కుందాం రహదారిపై ప్రమాదకరంగా గుంత

ఓజిలి: మండలంలోని కుందాం గ్రామానికి వెళ్లే రోడ్డుపై గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. గతేడాది కురిసిన వర్షాలకు కల్వర్టు కింద సాగునీరు ప్రవహించి రహదారిపై గుంత పడింది. రాత్రిసమయాల్లో రహదారిపై ప్రయాణించే వాహనచోదకులు గుంత కనబడక ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో గుంత కనబడే విధంగా కొందరు తాటిమట్టలను ఉంచారు. ఆర్అండ్బీ అధికారులకు గుంతలను పూడ్చాలని విన్నవించినా పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. వీర్లగునపాడు, మానమాల గ్రామాల వద్ద రహదారి పక్కనే గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇకనైనా సంబంధిత అధికారులు గుంతలను పూడ్చి ప్రమాదాలను నివారించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

### తగ్గని ముసురు


తీర ప్రాంతంలో రోడ్డుపై నిలిచిన నీటిలో వెళుతున్న ఆర్టీసీ బస్సు

చిల్లకూరు: గత రెండు రోజులుగా గూడూరు నియోజకవర్గంలో ఓ మోస్తరు వర్షం కురిసిందే తప్ప ఎక్కడా పెద్ద వర్షాలు పడిన దాఖలాలు లేవు. దీనికి తోడు తీర ప్రాంత గ్రామాలలో ఈదురు గాలులు విపరీతంగా ఉండడంతో వృద్ధులు, చిన్న పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. మంగళవారం కూడా వాతావరణం పూర్తిగా మబ్బులేసుకుని ముసురు పట్టింది. చిన్న పాటి వర్షాలకే తీర ప్రాంతంలోని కొన్ని రోడ్లు మోకాటిలోతు నీటితో నిండి పోవడంతో బైక్లు, చిన్న వాహనాలు, ఆటోలలో ప్రయాణించే వారు ఇక్కట్లు పడుతున్నారు. అధికారులు మాత్రం ఇప్పటికే అన్ని గ్రామాలలో భారీ వర్షాలు పడుతాయని అందరినీ అప్రమత్తం చేస్తున్నారు.

# వరదొస్తే ఉపద్రవమే..


కర్లపూడి వద్ద స్వర్ణముఖి చల్లకాలువలో రొయ్యల సాగు


సిద్ధవరం వద్ద బ్రిడ్జి దిగువన రొయ్యలసాగు


స్వర్ణముఖి చల్లకాలువలో కలుస్తున్న రొయ్యలసాగు వ్యర్థాలు

మండలంలో స్వర్ణముఖి చల్లకాలువ ప్రధాన నీటి వనరు. సాగునీటితోపాటు గ్రామాల్లో తాగునీటికి కూడా స్వర్ణముఖి చల్లకాలువపైనే ప్రజలు ఆధార పడుతున్నారు. అయితే ప్రస్తుతం కబ్జారాయుళ్ల నుంచి స్వర్ణముఖి చల్లకాలువను రక్షించాల్సి ఉంది. స్వర్ణముఖిని రక్షించాల్సిన వివిధ శాఖల అధికారులు ఆక్రమణదారులకు అండగా నిలుస్తూ ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఆక్రమణదారులు నదీగర్భాన్ని సైతం ఆక్రమించి రొయ్యల గుంటలు సాగు చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఆక్రమణలు పెరిగాయి. కొన్ని చోట్ల పొర్లుకట్టలను సైతం ధ్వంసం చేశారు. మండలంలోని కొక్కుపాడు, అగ్రహారం, కర్లపూడి, ఉత్తమనెల్లూరు, సిద్ధవరం గ్రామాల్లో స్వర్ణముఖి చల్లకాలువను ఆక్రమించి రొయ్యలసాగు చేస్తున్నారు. – కోట

- స్వర్ణముఖి చల్లకాలువ వెంబడి ఆక్రమణలు
- ఆక్రమిత ప్రాంతాల్లో విస్తారంగా రొయ్యల సాగు
- 5 గ్రామాలు, 10 గిరిజన కాలనీలకు పొంచి ఉన్న ముప్పు

**ఆక్రమణదారుల బరితెగింపు**

స్వర్ణముఖి నది గూడలి వద్ద పాయగా చీలుతుంది. ఈ చీలికలో ఓ పాయ చల్లకాలువగా మండలంలో ప్రవహిస్తోంది. ఈ చల్లకాలువ అతి పెద్దదైన పెన్నక్కచెరువుతోపాటు 19 చెరువులకు నీటిని అందిస్తుంది. గూడలి నుంచి 18 కిలోమీటర్ల మేర ప్రవహించి గోవిందుపల్లిపాళెం వద్ద సముద్రంలో కలుస్తుంది. కోట, కొత్తపాళెం నుంచి సిద్ధవరం వరకు చల్లకాలువ వెంబడి సరాసరిన వందల ఎకరాలు ఆక్రమణలకు గురైంది. సుమారు 500 ఎకరాల మేర ఆక్రమించి రొయ్యలు సాగు చేస్తున్నారు. ఇందుకు వివిధ శాఖల అధికారులు సాయం అందిస్తున్నారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేసి తమ సేవలందిస్తున్నారు. స్వర్ణముఖికి వరద ప్రవాహం వస్తే రొయ్యల గుంటల కారణంగా వరద ప్రవాహం గ్రామాలను ముంచెత్తే అవకాశం ఉంది. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు 8 చోట్ల గండ్లు పడి కోట దళితవాడ, కర్లపూడి, జరుగుమల్లి, ఉత్తమనెల్లూరు గ్రామాలు ముంపు ముంగిట నిలిచాయి. పొర్లు కట్టలను ఆనుకుని ఉన్న మేకలతోట, సానమాలదిబ్బ గిరిజన కాలనీలతోపాటు మరికొన్ని కాలనీలు కూడా ముంపునకు గురయ్యాయి. రొయ్యలగుంట కారణంగానే వరద ప్రవాహం గ్రామాలను ముంచెత్తినట్లు అధికారులు నిర్ధారించారు. తుపాను హెచ్చరికలతో మళ్లీ అదే పరిస్థితి పునరావృతమవుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆక్రమణలను తొలగించి స్వర్ణముఖి చల్లకాలువను కాపాడాలని కోరుతున్నారు.

**కొల్లగొడుతున్నా పట్టించుకోవడం లేదు**



స్వర్ణముఖి చల్లకాలువను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఏళ్ల తరబడి ఆక్రమణలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. రొయ్యలసాగు కారణంగా పొర్లు కట్టలు బలహీనపడుతున్నాయి.

– రాజారెడ్డి, అగ్రహారం

**గ్రామాలకు ముంపు తప్పదు**



కర్లపూడి వద్ద స్వర్ణముఖి చల్లకాలువలో రొయ్యల గుంటలను తొలగించే దిశగా అధికారులు చొరవ తీసుకోవాలి. గత ఏడాది వరదల కారణంగా చల్లకాలువ పొర్లు కట్టలకు గండ్లు పడ్డాయి. మూడురోజులపాటు గ్రామానికి రాకపోకలు స్తంభించాయి. మళ్లీ ఆ పరిస్థితి రాకుండా చూడాలి.

– సురేంద్ర, కర్లపూడి

**విచారణ జరిపించాలి**



సిద్ధవరం బ్రిడ్జి దిగువన స్వర్ణముఖి చల్లకాలువ పూర్తిగా ఆక్రమణలకు గురైంది. దీంతో వరద నీటి ప్రవాహం సాఫీగా పోయే పరిస్థితి లేదు. చల్లకాలువ సముద్రంలో కలిసే వరకు గ్రామాల్లో పరిశీలన జరిపి ఆక్రమిత ప్రాంతాల్లోని రొయ్యలగుంటలను తొలగించాలి.

– మాధవ్, సిద్ధవరం

### వివాహిత ఆత్మహత్యపై విచారణ


దక్కిలి: దండవోలు గిరిజన కాలనీలో విచారణ చేస్తున్న అధికారులు

దక్కిలి: దండవోలు గిరిజన కాలనీకి చెందిన ఏకోలు చెంచులక్ష్మి ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులపై మంగళవారం అధికారులు విచారణ చేపట్టారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఐటీడీఏ పీఓ పరిమళ, తిరుపతి జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి సూర్యనారాయణ, దక్కిలి తహసీల్దార్ మోపూరు శ్రీనివాసులు, గిరిజన సంఘాల నాయకులతో కలిసి మంగళవారం దండవోలు గిరిజన కాలనీలో విచారించారు. మృతురాలి కుటుంబం గిరిజనులు కావడంతో ఆర్థిక సాయం అందించేందుకు వారితో మాట్లాడారు. ఐటీడీఏ పీఓ పరిమళ, తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ చెంచులక్ష్మి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తామన్నారు. తిరుపతి జిల్లా అధికారులు కూడా సాయం చేసేందుకు కృషి చేస్తున్నట్లు వారు తెలిపారు. దీనిపై సమగ్ర నివేదిక తయారు చేసి జిల్లా కలెక్టర్కు అందజేయనున్నట్లు వివరించారు. యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య, తిరుపతి జిల్లా అధ్యక్షుడు తలపల చెంచుమల్లికార్జున రావు, మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉషా, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇండ్ల మల్లికార్జున, జై భారత్ ఎస్సీ పోరాట వేదిక రాష్ట్ర కార్యదర్శి తలారి నాగరాజు, నవజీవన్ స్వచ్ఛంద సంస్థ ఆర్గనైజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### అబ్దుల్ కలాంకు ఘన నివాళి

సూళ్లూరుపేట: భారత మాజీ రాష్ట్రపతి, ఇండియన్ మిస్సైల్ మ్యాన్ ఏపీజే అబ్దుల్ కలాంకు షార్ మాజీ డైరెక్టర్ కాటూరి నారాయణ మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. కలాం జయంతిని పురస్కరించుకుని సూళ్లూరుపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అవరణలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎస్కేఎస్ ప్రతినిధి షేక్ ఉస్మాన్బాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పట్టణంలోని ప్రముఖులు కూడా కలాం విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించారు. ఎంఈఓ శ్రీనివాసులు రెడ్డి, పట్టణానికి చెందిన తేరే వీరయ్య, బీజేపీ నాయకులు తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, వైఎస్ఆర్ సీపీకి చెందిన అయితా శ్రీధర్ పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న షార్ మాజీ డైరెక్టర్ కాటూరి నారాయణ

## ఉపాధి పనులతో మరింత అభివృద్ధి

బాలాయపల్లి(సైదాపురం): గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పథకం పనులతో మరింత అభివృద్ధి చేసే దిశగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ వినీల్ పేర్కొన్నారు. మండలంలోని అలిమిలి, గొట్టికాడు, మన్నూరుమిట్ట గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈఓపీఆర్డీ మోహన్రాజు, ఏపీఓ మృత్యుంజయ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ముంపు ప్రాంత ప్రజల రక్షణకు చర్యలు


బీవీ పాళెం పడవల రేవులో ఆర్డీఓ కిరణ్మయి


మాట్లాడుతున్న తుపాన్ ప్రత్యేక అధికారి శోభన్బాబు

తడ: తుపాన్ హెచ్చరికల నేపథ్యం ముంపు ప్రాంతాల ప్రజలతోపాటు మత్స్యకారుల రక్షణ కోసం అన్ని సహాయక చర్యలు తీసుకున్నామని సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి తెలిపారు. మంగళవారం బీవీపాళెం పడవల రేవును ఆమె సందర్శించారు. ఇరకం ప్రజలు తుపాన్ సమయంలో పడవ ప్రయాణం చేయకుండా వారికి అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం బీవీపాళెం పాత కుప్పంలో మత్స్యకారులతో సమావేశమయ్యారు. ఇప్పటికే వేటకు వెళ్లిన జాలర్ల అందరినీ ఒడ్డుకు రప్పించామని, తదుపరి ఆదేశాలు అందేవరకు ఎవరూ వేటకు వెళ్లకుండా జాలర్ల సంఘం, అధికారులు చూసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజల సౌకర్యార్థ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆమె వెంట తహసీల్దార్ శరత్, ఎంపీడీఓ విజయ్కుమార్, ఎస్ఐ కొండప్పనాయుడు తదితరులు ఉన్నారు.

**ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి**

దొరవారిసత్రం: దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ మండలాల్లోని ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని తుపాన్ ప్రత్యేక అధికారి, డీఆర్డీఏ పీడీ శోభన్బాబు తెలిపారు. దొరవారిసత్రం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఓలతో తుపాన్ హెచ్చరికలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ముంపు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షితంగా తరలించే విధంగా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మండల స్థాయి అధికారులు కూడా గ్రామాల్లోని పరిస్థితులను పరిశీలిస్తున్నారని, ప్రజలకు అందుబాటులో ఉన్నారన్నారు. ఇబ్బందులు పడకుండా కంట్రోల్ రూమ్ నంబర్కు ఫోన్ చేయాల్సిందిగా ఆయన తెలియజేశారు. ఈసమావేశంలో తహసీల్దార్ శైలకుమారి, వైస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్రెడ్డి, ఏఓ రఘు రామయ్య, ఎస్ఐ అజయ్కుమార్, వివిధ మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**ముందస్తు చర్యలు చేపట్టాలి**

సూళ్లూరుపేట రూరల్: అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆర్డీఓ కిరణ్మయి తెలిపారు. సూళ్లూరుపేట మండల పరిషత్ కార్యాలయంలో తడ, సూళ్లూరుపేట మండల అధికారులతో తుపానుపై మంగళవారం సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ అధికారులందరూ అందుబాటులో ఉండాలని సూచించారు. ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్కు తరచూ సమాచారం అందజేయాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాలలో మౌలిక వసతుల వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ చెంచుబాబు, డీఆర్డీఓ పీడీ శోభన్ బాబు, తహసీల్దార్లు నరసింహారావు , శరత్, ఎంపీడీఓ ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

నాయుడుపేట టౌన్: బంగాళఖాతంలో ఏర్పాడిన అల్పపీడనంతో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక కోరారు. ఆమె మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉంటూ సహాయక చర్యలు చేపడుతున్నారన్నారు. మున్సిపాలిటీ పరిధిలో లోతట్టు ప్రాంతాల్లో కమిషనర్ షేక్ ఫజులుల్లాతో పాటు సచివాలయ ఉద్యోగులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్లైన్ నంబర్లు 08623 48084, 63048 55003 ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు చేపట్టారని చైర్ పర్సన్ వెల్లడించారు.


సమావేశంలో పాల్గొన్న అధికారులు

# కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్


శ్రీచైతన్య పాఠశాలలో అధికారులు

కోట: జిల్లా కలెక్టర్ ఆదేశాలను బేఖాతర్ చేస్తూ కోటలోని శ్రీచైతన్య పాఠశాలలో తరగతులను నిర్వహించడంపై అధికారులు మండిపడ్డారు. మంగళవారం శ్రీచైతన్య పాఠశాలలో తరగతులు జరుగుతున్నాయంటూ తహసీల్దార్ జయజయరావుకు ఫిర్యాదులు రావడంతో ఆయన ఎంపీడీఓ వేణు, ఎంఈఓ మస్తానయ్యతో కలసి పాఠశాలను సందర్శించారు. ప్రిన్సిపల్ చిరంజీవి ఆదేశాలతోనే విద్యార్థులకు పరీక్షలు పెడుతున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. దీంతో తహసీల్దార్ వారిపై మండిపడ్డారు. పదో తరగతి పిల్లలు మాత్రమే వచ్చారని, పంపేస్తామని ఉపాధ్యాయులు తెలియజేశారు. తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నా పిల్లల జాగ్రత్తలు పట్టవా అంటూ తహసీల్దార్ ఉపాధ్యాయులను మందలించారు. విద్యార్థులను ఇళ్లకు పంపివేశారు. మరోసారి ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకుంటామని ఎంఈఓ తెలిపారు.

## చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


చేతులను శుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతిజ్ఞ

సైదాపురం: మహిళలంతా పరిశుభ్రతలో భాగంగా చేతులను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్, తహసీల్దార్ ఇ.రమాదేవి, ఎంపీఎం చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన సైదాపురంలో మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం గ్లోబల్ హ్యాండ్ వాష్ డే పురస్కరించుకుని పలు కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మండల సమాఖ్య పరిధిలోని సభ్యులకు చేతులు కడిగే విధానంపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో కూడా ప్రతి మహిళ కూడా ఇలాగే హ్యాండ్ వాష్ చేసుకునేలా అవగాహన కల్పించాలంటూ పొదుపు మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీటీ అనురాధ, ఏపీఎం శైలజ పాల్గొన్నారు.

## తీరగ్రామాల్లో అధికారుల పర్యటన


తీర గ్రామాలకు వెళ్లే రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు


కారికాడు గ్రామంలో పర్యటిస్తున్న అధికారుల బృందం

దొరవారిసత్రం: తీరగ్రామాలైన కారికాడు, వేలికాడు, మీజూరు, నాగినేరి తదితర గ్రామాల్లో మంగళవారం తుపాన్ ప్రత్యేక అధికారి శోభన్బాబు వివిధ శాఖల అధికారులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా ప్రాంతాల్లోని ప్రజలతో మాట్లాడారు. ఎవరూ కూడా ఇబ్బందులు పడకుండా పునరావాస కేంద్రాలకు విచ్చేయాలని ఆయన ప్రజలకు తెలియజేశారు. తీర ప్రాంతాల్లోని రోడ్లు, పునరావాస కేంద్రాల భవనాలను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ శైలకుమారి, ఏఓ రఘురామయ్య, ఎస్ఐ అజయ్కుమార్, సర్వేయర్ నాగరాజు, వీఆర్ఓలు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

## రోడ్లు బురదమయం

ఓజిలి: గత రెండు రోజుల నుంచి స్వల్పంగా కురుస్తున్న వర్షాలకు అంతర్గత రహదారులు చిత్తడిగా మారాయి. మండల పరిధిలోని మాచవరం, తిరుమలపూడి, ముమ్మాయిపాళెం, కుందాం, కొత్తచెరువు, ఓజిలి, పెదపరియ, కారూరు తదితర గ్రామాల్లో రహదారులు అధ్వాన్నంగా తయారయ్యాయి. చిన్నపాటి వర్షాలకే రహదారులు బురదమయంగా మారి నడిచేందుకు వీలులేకుండా పోతుంది. వర్షపునీరు రోడ్లుపై ప్రవహిస్తోంది. గుంతలలో నీరు నిలిచి బురదమయంగా మారడంతో పాదచారులు సైతం అవస్థలు పడుతున్నారు.


ముమ్మాయిపాళెం కాలనీలో బురదమయంగా అంతర్గత రహదారి

## లోతట్టు ప్రాంతాలు జలమయం


కుండపోతగా కురుస్తున్న వర్షం


బురదమయంగా పాత ట్రెజరీ వీధి

నాయుడుపేట టౌన్: భారీ వర్షాల కారణంగా పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. విన్నమాల రోడ్డు, పట్టణంలోని పాత ట్రెజరీ వీధి, రాజగోపాలపురం, గరిడీ వీధి, రావువారివీధి, ఎల్ఏసాగరం, పాత, కొత్త బీడీ కాలనీలు తదితర లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు భారీగా చేరింది. రాకపోకలు జరిపే వారు సైతం తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. గరిడీవీధి, రావువారివీధి, రాజగోపాలపురంలో పలు చోట్ల డ్రైనేజీ కాలువల్లో మురుగునీరు రోడ్లపైకి ప్రవహించడంతో పాదచారులు సైతం అవస్థలు పడ్డారు.

## ట్రాలీని ఢీకొన్న ఆటో

చిల్లకూరు: చింతవరం గ్రామ సమీపంలో ట్రాలీని ఆటో ఢీ కొనడంతో మంగళవారం సుమారు అర్ధ గంట పాటుగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. స్థానికులు వివరాల మేరకు చింతవరం అంబేడ్కర్ సెంటర్లో రోడ్డు మరమ్మతు పనులు చేస్తున్న సమయంలో అక్కడ నిలిపి ఉన్న ట్రాలీని ప్యాసింజర్ ఆటో వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఆటో ముందు భాగం దెబ్బతినగా ఆటోలోని ప్రయాణికుడితోపాటుగా ఆటో డ్రైవర్కు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో స్థానికులు గాయపడ్డ వారిని వెంటనే పక్కనే ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. అటు తరువాత స్థానికులు ఆటోను పక్కకు తీసి వేయడంతో రాకపోకలు కొనసాగాయి.


ట్రాలీని ఢీ కొన్న ఆటో

### చేపల సొసైటీ పాలకవర్గం రద్దు

కలువాయి: చెరువు మత్స్యకార సహకార సంఘం పాలకవర్గాన్ని 14వ తేదీ నుంచి రద్దు చేసినట్లు మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంఘ కార్యకలాపాలు నిర్వహించేందుకు నెల్లూరు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సంజయ్ స్టీఫెన్ను ప్రత్యేకాధికారిగా నియమించారు. గతంలో ఉన్న పాలకవర్గం సభ్యులు సంఘ కార్యకలాపాలు సక్రమంగా లేవని సంఘ సభ్యులు జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో విచారణ నిర్వహించారు. అవకతవకలు జరిగినట్లు, ఫోర్జరీ సంతకాలు చేసినట్లు తేలడంతో పాలకవర్గాన్ని రద్దు చేసినట్లు తెలిపారు.

### కండలేరులో 32.200 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 32.200 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్రెడ్డి తెలిపారు. కండలేరు వరద కాలువ నుంచి 1400 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి చేరుతోందన్నారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 8400 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. సత్యసాయిగంగ కాలువకు 840, పిన్నేరు కాలువకు 40, లోలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

చిల్లకూరు: భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ పంపిణీ సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్, తుపాను నోడల్ అధికారి ఆదిశేషయ్య సూచించారు. తుపాను పరిస్థితిపై ఆయన గూడూరు, చిల్లకూరు, కోట మండలాల్లోని విద్యుత్ కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. ప్రతి ఒక్కరు తమ సెల్ఫోన్ చార్జింగ్ ఉండేలా చూసుకోవాలని తెలిపారు. వినియోగదారులు అత్యవసర సమయంలో కంట్రోల్ రూమ్కు 1912కు గానీ, 1800 4251 55333కు గానీ వాట్సాప్ నెంబర్ 9133331912కు సమాచారం తెలియజేయవచ్చని అన్నారు. ఆయన వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరేంద్రరెడ్డి, గూడూరు, కోట డీఈఈలు ప్రసాద్, చిన్నయ్య, మనుబోలు, చిల్లకూరు ఏఈలు అనిల్, శేషాద్రి , పోలయ్య తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ సిబ్బందితో మాట్లాడుతున్న ఆదిశేషయ్య